'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఉద్యోగాలపై ఇన్నిన్ని అసత్యాలా?

టంకశాల అశోక్

రాజకీయాలలో ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు చెప్పటం నాయకులకు సర్వసాధారణం. అధికార ప్రయోజనాల కోసం వారట్లా మాట్లాడటానికి ప్రజలు కూడా అలవాటు పడిపోయారు. అయినప్పటికీ కొన్ని విషయాలు చూసినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. తాము అధికారంలోకి వచ్చిన మూడు మాసాలలోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే ప్రకటించడం అటువంటి వాటిలో ఒకటి.

ఆ మాట నిజం కాదని, తమ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పాలనా ప్రక్రియ అంతా పూర్తి చేయగా ఎన్నికల కోడ్‌తో నిలిచినవాటికి నియామక పత్రాలు ఇవ్వటమే తప్ప.. కొత్త ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి చేసింది ఒక్కటైనా లేదని బీఆర్ఎస్ ప్రతిసారి ఎత్తిచూపుతున్నది. అది నిజమే అయినప్పటికీ ఆ పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున అట్లానే మాట్లాడుతుందని కాంగ్రెస్‌తో సహా ఎవరైనా కొట్టి వేస్తే వేయవచ్చు. కానీ స్వయంగా ఆ నియామక పత్రాలు అందుకున్నవారు గానీ, ఇతరత్రా నిరుద్యోగులు గానీ అంటున్నదేమిటో మనం వింటున్నామా?

వారు చెప్తున్న మాటల వీడియోలు సోషల్ మీడియాలో విరివిగా ఉన్నాయి. వాటిని ఇప్పటికే చూస్తున్నవారు సరేసరి. చూడనివారు ఇప్పటికైనా చూడవచ్చు. వేర్వేరు స్టడీ సెంటర్లకు వెళ్లి నేరుగా వారితో మాట్లాడవచ్చు. అభ్యర్థులతో మాత్రమే కాదు, వారి టీచర్లతో కూడా. అందరికందరూ ఒకేమాటగా చెప్తున్నది ఈ 30 వేల నియామకాలని చెప్తున్నవాటిలో కొత్త ప్రభుత్వం తన తరపున కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చి చేస్తున్నవి అసలు ఏమీ లేవని. ఇవన్నీ పాత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి అంతా చేయగా ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయినవేనని. వారంతా ఈ మాటలన్నీ ఎంత మాత్రం అస్పష్టత లేకుండా చెప్తున్నారు.

ఈ సమాచారం ప్రభుత్వానికి చేరటం లేదనుకోగలమా? అయినప్పటికీ ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు 30 వేల ఉద్యోగాల మాట మళ్లీమళ్లీ ఎందుకు అంటున్నారు? వాస్తవానికి ఈ నిజాలు వారికి బీఆర్ఎస్ గానీ, నియామక పత్రాలు అందుకున్నవారు గానీ, నిరుద్యోగులు గానీ, వారి టీచర్లు గానీ చెప్పనక్కర్లేదు. అన్నీ విషయాలు ప్రభుత్వానికి స్వయంగా తెలుసు. అయినప్పటికీ ఈ విధంగా ఇంత నిర్భయంగా అసత్యాలు ఎందుకు చెప్తున్నట్లు? ఆశ్చర్యం కలిగిస్తున్నది ఇదే. నిరుద్యోగులను ఇట్లా మోసం చేయ తగునా?

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగ సమస్య, నిరుద్యోగులూ ఎంతో కీలకమైన పాత్ర వహించిన విషయం తెలిసిందే. యథాతథంగానే ఆ సమస్య ఉండగా 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతుండగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పత్రాల లీక్, పలుమార్లు పరీక్షల రద్దు అన్నది అగ్నికి ఆజ్యంగా మారాయి. నిరుద్యోగులు కాలికి బలపం కట్టుకుని ఊరూరు తిరిగి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. వాస్తవానికి లెక్కల్లోకి వెళితే గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు తక్కువేమీ కాదు. కానీ యథాతథంగా నిరుద్యోగ సమస్య అయితే ఒక నిజం కాగా, తాము చేసినవేమిటో ఆ ప్రభుత్వం సరిగ్గా చెప్పుకోలేకపోగా, ప్రశ్నాపత్రాల లీకేజీ ముందు అన్నీ కొట్టుకుపోయాయి. కాంగ్రెస్ వ్యూహకర్తలు, ఇతర ప్రతిపక్షాలు, విమర్శక మేధావులు ఆ స్థితిని గొప్పగా ఉపయోగించుకున్నారు.

ఎన్నికల సమయంలో ఉండిన ఈ వాతావరణాన్ని తాము అధికారానికి వచ్చిన తొలి నాళ్లలో కూడా ఉపయోగించుకొనజూసిన ప్రభుత్వ నేతలు.. తాము 30 వేల ఉద్యోగాలు ఇచ్చేశామనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. అట్లాగే ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లు ఏడాదికాలంలో, అనగా డిసెంబర్ 2024 నాటికి 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కొత్తగా ఇవ్వగలమని భరోసా ఇవ్వ సాగారు. బహుశా దీనిపై నమ్మకం కలిగించేందుకు కావచ్చు, బీఆర్ఎస్ ప్రభుత్వమే అంతా చేసిన 30 వేల ఉద్యోగాలను తమవిగా చెప్పుకోవటం మొదలుపెట్టారు.

ఈ మాటలను నిరుద్యోగులు, వారి టీచర్లు ఆ తొలి నాళ్లలో ఎట్లా తీసుకున్నారో తెలియదు గానీ కొద్దివారాలు గడిచేసరికే అవన్నీ అసత్యపు మాటలని వారు గుర్తించడం, ఆ విధంగా మాట్లాడటం, ప్రభుత్వం పట్ల నిరసనలు వ్యక్తపరచడం మొదలైపోయింది. నిరుద్యోగులు పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు కనుక బహిరంగ ఆందోళనలు చేస్తుండకపోవచ్చు. కానీ వారి ఆలోచనలు పైన చెప్పినట్లు సోషల్ మీడియాలో, ఇతర వేదికలలో నిరంతరం వ్యక్తం కావడం చూస్తూనే ఉన్నాం. వారు ఎత్తిచూపుతున్నది ఏమిటి? ఈ 30 వేల నియామకాలన్నవి గత నోటిఫికేషన్లే తప్ప కొత్తవి కాదు అన్నది ఒకటి కాగా.. కొత్త నోటిఫికేషన్లు, పరీక్షలు అంటూ విడుదల చేసిన వేర్వేరు ఉద్యోగాలలో కూడా

గత ప్రభుత్వం ప్రకటించిన సంఖ్యలకు బాగా కోత పెట్టారనేది మరొకటి. మెగా డీఎస్సీ అని ఆశ పెట్టి అటువంటిదేమీ లేకపోగా.. దగా డీఎస్సీగా మారిందనే మాట వారే ఉపయోగిస్తున్నారు.

ఇంకా ఇటువంటి విషయాలే మరికొన్ని ఎత్తిచూపుతున్నారు. ఈ ధోరణిపై నిరసనగా ఇటీవల హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లోనైతే ఒక టీచర్, కొంతమంది విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. వారికి మద్దతుగా రాష్ట్రమంతటి నుంచి పలువురు నిరుద్యోగులు తరలివచ్చారు. ఆ సందర్భంగా మూడు మాటలు ప్రముఖంగా వినిపించాయి. వాటిలో ఒకటోది ఏమిటంటే.. ఇప్పుడు ఇచ్చామని అంటున్న ఉద్యోగాలన్నీ గత ప్రభుత్వానివే తప్ప కొత్తది ఒక్కటైనా లేదని. రెండోది.. ఉన్న ఉద్యోగ ఖాళీలకు ప్రస్తుత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చే సమయంలో కోతలు పెట్టి బ్యాక్‌లాగ్‌ను సృష్టిస్తూ తమకు అన్యాయం చేస్తున్నదని. మూడోది.. బహుశా ఇంతకన్నా ముఖ్యమైన మాట. వారంతా ముక్తకంఠంతో అంటున్నది.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు అనేది పూర్తిగా అసాధ్యం. అది మోసపు మాట. మూడు మాసాల్లో ఒక్క ఉద్యోగమైనా కొత్తది ఇవ్వనివారు మిగిలిన తొమ్మిది మాసాల్లో రెండు లక్షలు ఎట్లా ఇస్తారన్నది వారి సూటి ప్రశ్న.

ఇదికాక నిరుద్యోగుల నుంచి, విద్యార్థుల నుంచి మరికొన్ని ప్రశ్నలు వినవస్తున్నాయి. జాబ్ క్యాలెండర్ అంటూ హామీ ఇచ్చి అందులో అనేకం ఇంతవరకు ప్రకటించలేదు. రెండు లక్షల ఉద్యోగాలు ఏయే శాఖలలో, ఏవేవి, ఎన్నెన్ని ఉన్నాయనే లెక్కలు ఇప్పటిదాకా సేకరించి చెప్పలేదు. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి ఇంతవరకు అమల్లోకి తేకపోగా.. సాక్షాత్తూ అసెంబ్లీలో స్వయంగా ఉపముఖ్యమంత్రి తాము అసలా హామీయే ఇవ్వలేదన్నారు. కనీసం తర్వాతనైనా ఆ మాటలను సవరించుకోలేదు. వంద రోజుల గడువు గల 6 గ్యారెంటీల్లో భాగంగా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ప్రసక్తి తేవడం లేదు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లు తెస్తామని ప్రకటించి నామకార్థంగా ఏదో చేయడం తప్ప తిరిగి ఆ జోలి లేదు. స్కూలు పిల్లలకు ఉదయం వేళ అల్పాహార పథకం అర్ధాంతరంగా ఆగిపోయింది. వీటితో పాటు నిరుద్యోగులు, విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలు కూడా వారి మధ్య చర్చకు వస్తున్నాయి.

ఇవేమీ జరగకుండానే ఇప్పుడిక లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఆ నిబంధన జూన్ మొదటి వారానికి గానీ ముగియదు. అప్పటి నుంచి 2 లక్షల ఉద్యోగాల భర్తీకి డిసెంబర్‌లోగా మిగిలే సమయం కేవలం 6 నెలలు. అసలు అన్ని ఉద్యోగ ఖాళీలు ప్రభుత్వంలో ఎక్కడున్నాయో లేదా ఏ విధంగా సృష్టిస్తారో ఇంతవరకు లెక్కలు లేవు, స్పష్టత లేదు. ఎన్నికలు ముగిసే వరకు ప్రభుత్వ నాయకత్వమంతా వాటితోనే తలమునకలుగా ఉంటుంది. ఆ తర్వాత ఈ కార్యమంతా ఎంతవరకు సాధ్యం?

ఈ ప్రశ్నల గురించి చర్చించేందుకు ప్రభుత్వ నాయకత్వానికి ఇష్టం లేకపోవచ్చు. లేదా వారందుకు జంకుతుండవచ్చు. కానీ నిరుద్యోగులలో, వారి కుటుంబాలలో, విద్యార్థులలో, టీచర్లలో ఇందుకు సంబంధించి ఒక చర్చ మరొక చర్చకు దారి తీయడం మొదలైంది. ప్రభుత్వ నాయకత్వం ఇది గ్రహించి వాస్తవ స్థితి ఏమిటో చెప్పి దిద్దుబాటు చర్యలు ఏవైనా వీలవుతాయో ఆలోచించటానికి బదులు.. తాజాగా ఈరోజు వరకు కూడా తాము మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామనే అసత్యాన్ని ఎంతో ధైర్యంగా మళ్లీ మళ్లీ చెబుతున్నారు.

ఆ కారణంగా నిరుద్యోగులకు, యువతీయువకులకు, విద్యార్థులకు, టీచర్లకు ప్రభుత్వంపై విశ్వాసం వేగంగా అడుగంటిపోతున్నది. అందుకు సమాంతరంగా నిరసన భావనలు అంతే వేగంగా పెరుగుతున్నాయి. దేశంలో నిరుద్యోగం, హామీలు, ఆశానిరాశలు, నిరసనలు, ఉద్యమాలు మనం ఎప్పటినుంచో చూస్తున్నవే. కానీ వారి ఆశలు స్వల్పకాలంలోనే ఎంతో ఉవ్వెత్తున ఎగిసి, అంతే వేగంగా తిరిగి పడిపోతుండటం మాత్రం అరుదైన స్థితి. దాని ప్రభావాలు ఏ విధంగా ఉండగలవన్నది వేచి చూడాల్సిన విషయం.

ఇవేమీ జరగకుండానే ఇప్పుడిక లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఆ నిబంధన జూన్ మొదటి వారానికి గానీ ముగియదు. అప్పటి నుంచి 2 లక్షల ఉద్యోగాల భర్తీకి డిసెంబర్‌లోగా మిగిలే సమయం కేవలం 6 నెలలు. అసలు అన్ని ఉద్యోగ ఖాళీలు ప్రభుత్వంలో ఎక్కడున్నాయో లేదా ఏ విధంగా సృష్టిస్తారో ఇంతవరకు లెక్కలు లేవు, స్పష్టత లేదు. ఎన్నికలు ముగిసే వరకు ప్రభుత్వ నాయకత్వమంతా వాటితోనే తలమునకలుగా ఉంటుంది. ఆ తర్వాత ఈ కార్యమంతా ఎంతవరకు సాధ్యం?

వెలుగుల దివిటీ

నేడే హోలీ
మనమంతా ఒక్కటవ్వాలి
నేడే హోలీ
ఆడే పాడే ఆనందాల హేళి
జానపదుల జావళి
జాజిరి పాటల మంజరి
హోలీకాపై విజయభేరి
వసంతోత్సవ కేళీ
రంగురంగుల రంగేళీ
కుల మత భేదాల్ని వీడి మనమంతా
ఏకమవ్వాలి
ప్రకృతి దోసిట్లో రంగులన్నీ దాగితే
కమ్ముకున్న చిమ్మచీకటి
దోసిట్లోంచి ఒక్కో రంగు ఒలికితే
వెలుగుల దివిటీ
ఆ దివిటీల వెలుగుల్లో
తిమిరాన్ని తరిమే
ఆనందాల డోలిక
భోగి మంటల్లో
కాముని దహన వేదిక
తనలోని కొత్త రంగుల్ని చూసి
పుడమి పులకించే వేడుక
సప్తవర్ణాల దృశ్యమాలిక
ప్రకృతి పరవశించి
కోయిలతో పాడే రుతు గీతిక
శిశిరానికి సెలవంటూ
వసంతం ఒడిలోకి హోలీ చేరిక

డాక్టర్ రానవేయిన రమేష్

మరణశయ్యపై నేతన్న మగ్గం

సుసంపన్న భారతదేశ నాగరికతకు వన్నె తెచ్చిన చేనేత పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తున్నది. దేశంలో నేటికీ సుమారు 20 లక్షల మగ్గాలపై కోటిమంది జీవనోపాధి పొందుతున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా జరిగిన స్వదేశీ ఉద్యమం ఈ రంగానికి కొత్త ఊపునిచ్చింది. ఈ వృత్తిలో మహిళలు, పిల్లలతో సహా కుటుంబ సభ్యులందరి భాగస్వామ్యం ఉంటుంది. మన రాష్ట్రంలో 25 వేల చేనేత మగ్గాలు, మరో 80 వేల మరమగ్గాలపై దాదాపు 2 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలో అనేక గ్రామాలు చేనేత, పవర్‌లూమ్ కేంద్రాలుగా పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్నాయి.

కూరపాటి రమేష్
94900 98048

దేశంలోని ప్రభుత్వాల నిర్లక్ష్యం, చేనేత వ్యతిరేక విధానాల వల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఫలితంగా నేడు చేనేత, పవర్‌లూమ్ కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారు. సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా పాలకులు స్పందించకపోవడంతో సంక్షోభం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని బట్టి చూస్తే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం ప్రభుత్వాలు చూపకపోవడం విచారకరం.

కార్మికుల ప్రయోజనాలను కాపాడి, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే ప్రధాన ఉద్దేశంతో చేనేత సహకార వ్యవస్థ ఏర్పడింది. రాష్ట్రంలో 458 సహకార సంఘాలు ఉన్నాయి. వీటికి మాతృ సంస్థ టెస్కో. వీటి సహకారంతో సంఘాలలోని సభ్యులు వస్త్రాలను ఉత్పత్తి చేసి తద్వారా ఉపాధి పొందుతున్నారు. ఉత్పత్తి అయిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. అయితే అప్పులు తెచ్చి వస్త్రాలను ఉత్పత్తి చేసిన సహకార సంఘాలు ఆ అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నాయి. తద్వారా నష్టాల పాలవుతూ మూతపడుతున్నాయి. ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు, మాతృ సంస్థ అయిన టెస్కోకు ప్రజాస్వామ్యయుతంగా ప్రతి ఐదేండ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాలి. 2013లో ఎన్నికైన పాలకవర్గాల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. అయినా నేటికీ ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయకపోవడంతో సహకార వ్యవస్థ నిర్వీర్యమవుతున్నది.

బకాయిలు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరుగుతున్నది. దీంతో సహకార, సహకారేతర రంగం సంక్షోభంలో కూరుకుపోయి పని కల్పించలేని స్థితికి దిగజారాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత, పవర్‌లూమ్ కార్మికుల బోర్డులను, పథకాలను రద్దు చేసింది. జాతీయ చేనేత బోర్డు, జాతీయ టెక్స్‌టైల్ బోర్డు, మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, హౌస్ కమ్ వర్క్ షెడ్ తదితర పథకాలను రద్దు చేయడంతో పాటు జీఎస్టీని విధించి చేనేత రంగాన్ని, ఆ రంగంపై ఆధారపడిన కార్మికులను రోడ్డున పడేసింది.

గత ప్రభుత్వాల కంటే మెరుగైన పాలన, మెరుగైన జీవన ప్రమాణాలు ఉండే విధంగా పాలిస్తామని చెప్పిన కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. నేతన్నల ఉపాధి, సంక్షేమం దృష్ట్యా కొత్త పథకాలను ప్రకటించకపోగా ఉన్న పథకాలను కూడా అమలు చేయకుండా నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నది.

గత రెండు నెలలుగా చేనేత, పవర్‌లూమ్ కార్మికులు, సంఘాలు తమ సమస్యలను, స్థితిగతులను ప్రభుత్వాలకు అనేక సందర్భాల్లో విన్నవించినా, సిరిసిల్ల లాంటి ప్రాంతాల్లో పోరాటాలు చేస్తున్నా, కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నా స్పందించకపోవడం శోచనీయం. పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల నేడు రాష్ట్రంలోని చేనేత, పవర్‌లూమ్ మగ్గాలు మరణశయ్యపై వేలాడుతున్నాయి. కష్టాలు చుట్టుముట్టినంత మాత్రాన ఆత్మహత్యలే శరణ్యమనుకోవడం సరికాదు. అదే సమస్యలకు పరిష్కారం కాదు. పోరాటాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీద్దాం. సమస్యలను పరిష్కరించుకుందాం.

చరిత్రను వక్రీకరించిన రజాకార్

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

సాధారణంగా నాటికలు, నాటకాలు, హరికథలు మొదలైన ప్రజా కళారూపాలు ప్రజలకు కాలక్షేపంతో పాటు, ఆనందాన్ని కలిగిస్తాయి. వినోదాన్ని పంచుతాయి. వాటిలోని కథ, కథనాలు.. చరిత్రను, సంస్కృతిని మర్మగర్భంగా అందిస్తాయి. పురాణాలు, చారిత్రక సన్నివేశాలను వివరించేటప్పుడు కాలానుగుణంగా కథ, కథనాల్లో కొంత మార్పులు, చేర్పులు చేయటం సహజమే. కథను ఉన్నది ఉన్నట్టుగా చూపించటం అన్నివేళలా సాధ్యం కాదు కూడా. ఇక రేడియో, టీవీ, సినిమాల విషయానికి వచ్చేసరికి అంతా మారిపోయింది. సాంకేతిక యుగంలో సినిమాలు కాసులు దండుకునే ఓ వస్తువుగా పరిణమించింది. ఎవరికి తోచినట్టువారు చరిత్రను చూపించడం పరిపాటిగా మారిపోయింది.

ఇటీవల విడుదలైన వివాదాస్పద సినిమా రజాకార్ చరిత్ర కోణంలోనిదే. నిజాం పాలనలో ఖాసీం రజ్వీ నాయకత్వంలోని కిరాయి 'రజాకార్' సాయుధ దళం చేసిన దుర్మార్గాలే ఈ సినిమా కథ. అయితే అప్పుడెప్పుడో జరిగిన ఆ ఘటనలను ఇప్పుడు తవ్వి తీయటం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో అందరికీ తెలిసిందే. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈ సినిమాను దేశమంతటా వివిధ భాషల్లో ప్రదర్శించి.. హిందూ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి, గంపగుత్తగా వారి ఓట్లను కొల్లగొట్టాలన్నదే సినిమా ప్రధాన లక్ష్యం. ముస్లిం పాలకులు, రజాకార్ సైన్యం చేసిన దుర్మార్గాలను ఎక్కువగా చిత్రీకరించి, వాటిని చూపించి.. ముస్లింలంతా దుర్మార్గులేనన్న 'నెరేటివ్'ను చూపెట్టడమే ఈ సినిమా అసలు ఉద్దేశం.

తెలంగాణ సాయిధ పోరాటం నేపథ్యంలో వచ్చిన మరో సినిమా ఇది. గతంలో నరసింహారావు నిర్మించి, దర్శకత్వం వహించిన 'మా భూమి' అందరినీ అలరించింది. రజాకార్ సినిమా అప్పటి 'మా భూమి'ని మరిపిస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఈ సినిమాను చూస్తే.. 'చరిత్రను విస్మరించే వారు చరిత్రను నిర్మించలేరు' అని అంబేద్కర్ చెప్పిన మాటలు గుర్తుకువస్తున్నాయి. చరిత్ర ఆధారంగా రూపొందే సినిమాలు సినిమాటిక్‌గా ఉండేందుకు కథ, కథనాల్లో కొంతమేరకు మార్పులు, చేర్పులు చేస్తే మంచిదే. కానీ, పూర్తిగా చరిత్రను వక్రీకరించడం, గత చరిత్రను పూర్తిగా విస్మరించడం సరికాదు. రజాకార్ సినిమాలో అదే జరిగింది. ఈ సినిమాలో చరిత్రను పూర్తిగా విస్మరించడమే కాదు, వాస్తవ చరిత్రను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారు. గత చరిత్రను, సంఘటనలను, వ్యక్తులను, వారి పాత్రలను సమూలంగా చెరిపివేసే ప్రయత్నం చేశారు. దేశవ్యాప్తంగా హిందూ, ముస్లిం సోదరుల మధ్య ఉన్న మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా సినిమాను చిత్రీకరించారు.

బీజేపీ రాజకీయ సిద్ధాంతాలకు అనుగుణంగా గతంలో వచ్చిన కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ సినిమాల మాదిరిగానే రజాకార్ సినిమాను తీశారు. ఈ సినిమాలో ప్రధానంగా చెప్పదలచిన విషయం ఏమిటంటే.. చనిపోయేవారంతా హిందువులు, చంపేవారంతా క్రూరమైన ముస్లింలు అని. చరిత్రలో జరిగిన కొన్ని దురదృష్టకరమైన ఘటనలను మొత్తం ముస్లిం సమాజానికి ఆపాదించడం తగదు. సినిమాలో చూపించిందే నిజమైతే? షోయబుల్లాఖాన్‌ను చంపిందెవరు? రజాకార్లు కాదా?

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1836-60 మధ్యకాలంలో రాంజీ గోండు నాయకత్వంలో జరిగిన తిరుగుబాటును మత మార్పిడులకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించడం చారిత్రక తప్పిదం కాదా? బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన రాంజీ గోండు పోరాట కథను నిజాం వ్యతిరేక

పోరాటంలో మిళితం చేయటం ఏ విధంగా సబబు అవుతుంది. ఇలాంటి ఊహాకల్పనలను చరిత్రకు ఆపాదించటం సరైనది కాదు.

తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే అరుదైన పోరాటంగా పేరుపొందింది. దీనిపై ఎన్నో పుస్తకాలు, కథలు, పాటలు, కళారూపాలు, పోరాట యోధుల జీవిత చరిత్రలు వెలువడ్డాయి. అవి ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఆనాడు ప్రత్యక్షంగా పోరాడినవారు ఇచ్చిన ఇంటర్వ్యూలు ఉన్నాయి. కానీ వాటిని దర్శక, నిర్మాతలు ఏమాత్రం పట్టించుకోలేదు. నాటి ఉద్యమం గురించి వారు కనీసం తెలుసుకొనే ప్రయత్నం కూడా చేసినట్లు కనిపించడం లేదు. పైగా ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారనే కల్పిత కథనాన్ని జోడించారు. ఇందులోని సంభాషణలు కూడా అసత్యాలే.

తెలంగాణ సాయుధ పోరాటంలో కుల, మతాలకతీతంగా జరిగిన పోరాటాన్ని విస్మరించి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను హీరోగా చేసి చూపెట్టారు. మొత్తం సినిమా కథనం అంతా ఆయన చుట్టే తిరిగేలా చూపెట్టారు. అసలైన చరిత్ర ఏమిటంటే.. మాతృభాష పరిరక్షణ కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన గెరిల్లా యుద్ధమే తెలంగాణ సాయుధ పోరాటం. 'దొర ఏందిరో.. నీ దొరతనమెందిరో' అంటూ నాటి కమ్యూనిస్టు యోధులు చేసిన యుద్ధాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటం నిజాం పెత్తందా రీతనానికి, ఆయన అడుగులకు మడుగులొత్తిన భూస్వాముల దోపిడీకి, జమిందారీ గడీల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి, బానిస వ్యవస్థలకు, పాలేగాళ్లకు, దేశముఖ్‌లకు, ఇనాందార్లకు, తాబేదార్లకు వ్యతిరేకంగా జరిగింది. ఆనాడు ప్రజలు 'ఆంధ్రా మహాసభ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారే గానీ, 'వైదిక మతం జిందాబాద్' అని ఎక్కడా నినదించలేదు. అయినా ఈ సినిమాలో 'వైదిక మతం జిందాబాద్' అంటూ నినాదాలు చేసినట్లు చూపడం చూస్తుంటే.. కావాలనే ఒక రాజకీయ పార్టీకి రాబోయే ఎన్నికల్లో లబ్ధి చేకూర్చడం కోసమే సినిమాను తలకెత్తుకున్నట్టు అనిపిస్తున్నది. 'మనుషులను చంపగలరు కానీ.. మా మతాన్ని, హిందువులను చంపలేరు' అనే డైలాగ్‌ను కావాలనే చొప్పించారు. విసునూరు రామచంద్రారెడ్డి గుండాలు చంపిన షేక్ బందగి, రజాకార్లు చంపిన జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌లను చరిత్ర మరిచిపోదు. నాటి రజాకార్ల సైన్యానికి అధ్యక్షుడు ఖాసీం రజ్వీ అయితే, దానికి ఉపాధ్యక్షుడు విసునూరు రామచంద్రారెడ్డి అనేది జగమెరిగిన సత్యం.

నాటి పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన కమ్యూనిస్టుల గురించి, ప్రజా నాయకుల గురించి, కవులు, రచయితలు, కళాకారులు, యువజనులు, మహిళా నేతల గురించి మచ్చుకైనా చూపించలేదు. కమ్యూనిస్టులు భూసంస్కరణలు అమలుచేసి సుమారు 12 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచారు. వెట్టిచాకిరిని, బానిసత్వాన్ని రద్దు చేశారు. భూస్వాముల బీరువాల్లో దాచిన రుణ పత్రాలను కుప్పపోసి తగులబెట్టారు. అప్పులు, వడ్డీలు ఒక్క దెబ్బతో రద్దయ్యాయి. స్త్రీలకు సమాన హక్కులు కల్పించారు. కుల, మత వివక్ష లేకుండా కలిసికట్టుగా ప్రజలు జీవించే నేపథ్యాన్ని ఆనాటి నేతలు ప్రోదిచేశారు. తదుపరి కాలంలో ఈ సాయుధ పోరాట అనుభవాలు అనేక ప్రజా పోరాట ఉద్యమాలకు బాటలు వేశాయి. ఒక ధైర్యాన్ని, ప్రేరణను ఆ పోరాటం తెలంగాణ ప్రజలకు ఆయుధంగా ఇచ్చింది.

కమ్యూనిస్టు పోరాటం వల్లనే గ్రామాల్లో పీడన, బానిసత్వం నుంచి ప్రజలు విముక్తి పొందారు. కుండల్లో కారం, చీపిరి కట్టలు, రోకళ్లు మహిళల చేతుల్లో ఆయుధాలుగా మారాయి. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, కాళోజీ, దాశరథి తదితరుల కవితలు, ఉపన్యాసాలు, మాటలు, చేతలు తిరుగుబాటుకు ప్రేరణను ఇచ్చాయి. దున్నేవాడిదే భూమి అనే నినాదం గ్రామీణ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. దొరల దోపిడీకి వ్యతిరేకంగా భూస్వాములపై ఎర్రజెండా నీడలో సామాన్య ప్రజలు పోరాటం చేశారు. ఆ మట్టి మనుషుల త్యాగాలను ఈ సినిమాలో చూపెట్టలేదు. పైగా సంకుచిత బుద్ధితో చరిత్రను వక్రీకరించి చూపించారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత పాత్ర పోషించిన దొడ్డి కొమురయ్య, బద్దం ఎల్లారెడ్డి, పుచ్చల పల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, మఖ్దుమ్ మొయినుద్దీన్, మల్లు స్వరాజ్యం, ధర్మ భిక్షం, బెల్లం కొండ సత్తయ్య, కాళోజీ, దాశరథి సోదరులు మొన్నమొన్నటి వరకు వారి అనుభవాలను తమ రచనల్లో నిక్షిప్తం చేశారు. వారి అనుభవాలను, జ్ఞాపకాలను అనేక వేదికలపై పంచుకున్నారు. వారి జీవిత చరిత్రలు,